

వనపర్తి జిల్లా కేంద్రంలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులుదీరిన ఓటర్లు

# ఓటెత్తారు

- సజావుగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్
- సీసీ నిఘా, పటిష్ట పోలీస్ బందోబస్తు
- పర్యవేక్షించిన ఎన్నికల అధికారులు
- ఓటేసిన ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, అధికారులు

మహబూబ్‌నగర్, మే 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాలకు సోమవారం జరిగిన పోలింగ్‌లో అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు, ఎన్నికల బహిష్కరణలు, పలు చోట్లా ఈవీఎంల మొరాయింపు మినహా ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. చాలాచోట్లా ఎండను సైతం లెక్క చేయకుండా ఓటర్లు ఓటేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద బారులుదీరారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని నాలుగో వార్డు పరిధిలోని ఎదిర, దివిటిపల్లి, అంబటిపల్లి, సిద్ధాయపల్లి ప్రజలు అమరరాజా కంపెనీకి వ్యతిరేకంగా ఎన్నికలను బహిష్కరించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో బల్మూరు మండలం మైలారం గ్రామస్తులు అక్రమ మైనింగ్‌ను ఆపాలని ఎన్నికలను బహిష్కరించారు. ఆమనగల్ మండలం ముద్విని గ్రామంలో అక్రమ మైనింగ్ పర్మిషన్ ఎలా ఇచ్చారని కొద్దిసేపు ఎన్నికలు బహిష్కరించారు. కొల్లాపూర్ మండలం చెంచుగూడెంలోని చెంచుకాలనీకి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఓటర్లు ఓటెయ్యమని భీష్మించారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో ఓ బీఆర్ఎస్ కార్యకర్తకు చెయ్యి విరిగింది. ఆత్మకూరు మండలం జూరాల గ్రామంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు ఘర్షణ పడగా ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామంలోని పోలింగ్ బూత్‌లో ఓ దుండగుడు కారు గుర్తు కనిపించకుండా మార్కర్‌తో చెరిపేశారు. ఇది గమనించిన పార్టీ నేతలు ఆందోళన చేయడంతో గుర్తును మళ్లీ అమర్చారు. అడ్డాకుల మండలం రాచాల, అయిజ, కోడేరు, మద్దూరు మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో అధికారులు వాటిని సరిచేశారు. దీంతో ఆయా గ్రామాల్లో పోలింగ్ కొద్దిసేపు ఆలస్యంగా ప్రారంభమైంది. జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఊర్కొండ మండలం జంగబోయినపల్లిలో సమయం దాటినా కూడా 20 మంది ఓటర్లు ఉండడంతో వారికి ఓటేసే అవకాశం కల్పించారు. అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో ఓటు వేయడానికి వెళ్లిన ఓటర్లపై తేనెటీగలు దాడి చేయగా ఐదుగురికి గాయాలయ్యాయి. మొత్తంమీద చిన్న చిన్న ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలను తలదన్నే విధంగా పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ భారీగా జరిగింది. పోలింగ్ ముగియడంతో అధికార యంత్రాంగం ఈవీఎంలను సీల్ చేసి వాటిని పాలమూరు యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూములకు భారీ బందోబస్తు మధ్య తరలించారు.

***పోలింగ్ ప్రశాంతం.. భారీగా నమోదు..***

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు మినహా రెండు పార్లమెంట్ పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటలకి పోలింగ్ ప్రారంభం కాగా అప్పటికే ఓటర్లు ఆయా కేంద్రాల వద్ద బారులు దీరారు. ఉదయం పూట ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాతావరణం మేఘావృతం కావడంతో అక్కడక్కడ చిరు జల్లులు పడ్డాయి. వాతావరణం బాగా చల్లబడటంతో ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకొని ఓటేశారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఓటింగ్ సరళిని కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులు పరిశీలించారు. మహబూబ్‌నగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవినాయక్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ హర్ష, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల అధికారి ఉదయ్ కుమార్, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు తేజస్‌నందలాల్ పవార్ తదితరులు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఇటు ఆయా జిల్లా ఎస్పీలు, కలెక్టర్లు పోలింగ్ కేంద్రాల్లోని వెబ్ కెమెరాల ద్వారా కంట్రోల్ రూమ్‌లో ఉండి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్సును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అధికారులు కేంద్ర బలగాలను రంగంలో దించారు.

***ఓటేసిన సీఎం, అభ్యర్థులు..***

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొడంగల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి నవాబ్ పేట మండలం గురకుంటలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అలంపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు. మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్ మహబూబ్‌నగర్‌లో, నిరంజన్‌రెడ్డి వనపర్తిలో, లక్ష్మారెడ్డి జడ్చర్లలో ఓటేశారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ, కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మహబూబ్‌నగర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోగా జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రముఖులు సైతం తమతమ గ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

***ఉమ్మడి జిల్లాలో పోలింగ్ శాతం***

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సజావుగా సాగింది. మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 70.85, నారాయణపేట 68.71, షాద్‌నగర్‌లో 77.42, జడ్చర్లలో 76.07 శాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే సాయంత్రం 5 గంటల వరకు అందిన వివరాల మేరకు దేవరకద్ర 71.90 శాతం, , కొడంగల్ 65.54శాతం, మహబూబ్‌నగర్ 63.26శాతం పోలింగ్ నమోదైనట్లు చెప్పారు. అయితే మిగతా వివరాలు ఇంకా తెలియాల్సి ఉన్నది.



ఓటేస్తున్న ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్‌పీ, సిరా గుర్తు చూపిస్తున్న అభ్యర్థి మన్నె, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా



## ఈవీఎంపై కారు గుర్తు చెరిపివేత

- పోలింగ్ కేంద్రం వద్ద బీఆర్ఎస్ నాయకుల ఆందోళన
- అరగంటకుపైగా ఓటింగ్ నిలిపివేత
- తనిఖీ చేసిన ఎస్పీ రితిరాజ్

వడ్డేపల్లి, మే 13 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని పైపాడులోని ఒక బూత్‌లోని ఈవీఎం ప్యాడ్(బ్యాలెట్ యూనిట్)పై ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల కారు గుర్తును గుర్తు తెలియని వ్యక్తి మార్కర్ పెన్నుతో గీసి కనపడకుండా చేశారు. గుర్తించిన ఓటర్లు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహించడంతో పోలింగ్ కాసేపు నిలిచిపోయింది. సెక్టోరియల్ ఆఫీసర్ నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.. పైపాడులోని 167వ బూత్‌లో 1,196 ఓట్లు ఉన్నాయి. అన్ని బూతుల మాదిరిగానే ఇక్కడ కూడా సజావుగా ఓటింగ్ జరిగింది. 1,196 ఓట్లకు గానూ 848 ఓటు వద్ద కారు గుర్తు కనిపించకుండా ఓ వ్యక్తి మార్కర్‌తో గీసినట్లు గుర్తించి వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. అరగంటకు పైగా పోలింగ్ నిలిపివేసి అధికారుల ఆదేశాల మేరకు కారు గుర్తుపై ఉన్న ఇంకును బట్టతో తుడవడంతో యథావిధిగా పోలింగ్ నిర్వహించారు. ఈ కేంద్రంలో మొత్తం 873 ఓట్లు పోలైనట్లు సెక్టోరియల్ అధికారి తెలిపారు. కారు గుర్తు కనిపించకుండా మార్కర్‌తో గీయడంతో అరగంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎస్పీ రితిరాజ్ పోలింగ్ కేంద్రానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలింగ్ యథావిధిగా సాగుతుందని, ఎలాంటి సమస్య లేదని చెప్పారు.

***ఎన్నికల్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం***

బీఆర్ఎస్‌కు ఓట్లు పడకుండా చేయాలనే ఉద్దేశంతో కారు గుర్తుపై స్కెచ్‌తో గీసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు రీపోలింగ్ నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, దీనిపై ఎన్నికల కమిషన్, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని, తమకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని పేర్కొన్నారు.

కారుగుర్తుపై స్కెచ్‌తో గీసిన దృశ్యం

## బీఆర్ఎస్ నాయకులపై దాడి



గొడవపడుతున్న ఇరుపార్టీల నేతలు

పాలమూరు, మే 13 : మహబూబ్‌నగర్ రూరల్ మండలం పోతన్‌పల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడికి దిగారు. కొన్ని రోజులుగా మాజీ సర్పంచ్, ఎంపీటీసీ వర్గాల మధ్య విభేదాలు ఉండడంతోనే ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్నది. పోలీసులు జోక్యం చేసుకొని సర్దిచెప్పారు. అదేవిధంగా ఓటింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి సహకరించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





పోలీసులను ప్రశ్నిస్తున్న లక్ష్మమ్మ

## ఓటు ఎందుకు తీసేశారు..?

మరికల్, మే 13 : గత అసెంబ్లీ ఎన్నికల్లో నేను ఓటు వేశాను.. పార్లమెంట్ ఎన్నికల్లో నా ఓటును ఎందుకు తొలగించారంటూ రాకొండ గ్రామానికి చెందిన లక్ష్మమ్మ పోలింగ్ కేంద్రం గేటు ఎదుట నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన పోలీసులతోనూ ఆమె వాగ్వాదానికి దిగింది. మీరు మీ డ్యూటీ చేస్తున్నారు.. మరి నేను కూడా బాధ్యతగా ఓటు వేయాలి కదా..? మరి నా ఓటెందుకు తీసేశారంటూ పోలీసులు, పంచాయతీ కార్యదర్శితో వాదనకు దిగింది. గ్రామస్తులు సర్ధిచెప్పినా వినకపోవడంతో కొంత సేపు పోలింగ్‌ను నిలిపివేశారు. అనంతరం కుటుంబ సభ్యులు వచ్చి ఆమెను వారించి ఇంటికి తీసుకెళ్లారు.

## ఈవీఎంల మొరాయింపు

- పలుచోట్ల ఆలస్యంగా పోలింగ్



కోడేరు పోలింగ్ కేంద్రం బయట కూర్చున్న ఓటర్లు

కోడేరు/తిమ్మాజిపేట/నవాబ్‌పేట/మూసాపేట/ఆత్మకూరు/మహ్మదాబాద్/మరికల్, మే 13 : ఉమ్మడి పాలమూరు జిల్లాలో పలు చోట్ల ఈవీఎంలు మొరాయించాయి. దీంతో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు పలు చోట్ల ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఓటు వేసేందుకు ఆయా ప్రాంతాల ఓటర్లు పడిగాపులు కాశారు. అధికారులు వెంటనే కొత్తవి ఏర్పాటు చేయడంతో పోలింగ్ సరళి సజావుగా సాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని నాలుగు గ్రామాల్లో సమస్య ఉత్పన్నం కాగా.. మండల కేంద్రంలోని 71, 74వ పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పనిచేయలేదు. సింగాయిపల్లి, ఎత్తంలో మిషన్లు పనిచేయక పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. తిమ్మాజిపేట మండలం బావాజీపల్లిలో కొంత ఉద్రిక్తత నెలకొన్నది. సాయంత్రం కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య ప్రారంభమైన వాగ్వాదం పరస్పరం దాడులకు దారితీసింది. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టడంతో గొడవ సద్దుమణిగింది. అలాగే మహబూబ్‌నగర్ మండలం మూసాపేట మండలం రాచాలలో 51వ పోలింగ్ కేంద్రంలో ఉదయం, జానంపేటలో 73వ సెంటర్‌లో మధ్యాహ్నం, నవాబ్‌పేట పట్టణంలోని ఉన్నత పాఠశాలలో, మహ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌లో 110వ కేంద్రంలో 49 నిమిషాల పాటు ఈవీఎంలు మొరాయించాయి. 35 నిమిషాలు పనిచేయకపోవడంతో డీఎస్పీ సుదర్శన్, ఎస్సై శేఖర్‌రెడ్డి కేంద్రాన్ని సందర్శించారు. ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ సజావుగా కొనసాగింది. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పరిశీలించారు. తర్వాత వాటిని సరిచేయగా.. కొన్ని చోట్ల మరో మిషన్ ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమళ్లలో అర్ధగంటసేపు ఈవీఎం, జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ 69 పోలింగ్ కేంద్రంలో గంటసేపు వీవీప్యాట్ మొరాయించింది. అధికారులు వేరే మిషన్లు ఏర్పాటు చేసి పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టారు.

## మా ప్రాణాలంటే లెక్కలేదు.. ఓటెందుకేయాలి?

- మహబూబ్‌నగర్ నాలుగో వార్డులో ఎన్నికలను బహిష్కరించిన ప్రజలు



నిరసన తెలుపుతున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు

పాలమూరు, మే 13 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డు పరిధిలోని ఎదిర, దివిటిపల్లి, అంబటిపల్లి, సిద్ధాయపల్లి ప్రజలు ఐటీ పార్కులో ఏర్పాటు చేసిన అమరరాజా బ్యాటరీ కంపెనీని తొలగించాలని కోరుతూ సోమవారం పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించారు. దీంతో వార్డుల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద పూర్తి నిశబ్ధ వాతావరణం నెలకొన్నది. పోలింగ్ అధికారులు కుర్చీలకే పరిమితమయ్యారు. సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మీడియాతో మాట్లాడుతూ అమరరాజా కంపెనీ వల్ల భవిష్యత్తులో మా ప్రాణాలకే ప్రమాదం ఉందని, నీరు, గాలి కాలుష్యం కావడంతో పరిసర ప్రాంతాలు కాలుష్యానికి గురై నష్టం వాటిల్లుతుందని, అందుకే పోలింగ్‌ను పూర్తిగా బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గోడును వెల్లబోసుకున్నా పట్టించుకోవట్లేదని వాపోయారు. మా ప్రాణాలంటే లెక్కలేనప్పుడు ఓటెందుకేయాలని వారు ప్రశ్నించారు. 3,299 మంది ఓటర్లకు గానూ కేవలం 130 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శివశంకర్, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచులు జంగన్న, వెంకటయ్య, హాకీం, ఎల్లయ్య, సత్యం, నర్సింహులు, కృష్ణ, రాములు, అమరరాజా వ్యతిరేక పోరాట సమితి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి శేఖర్, నాగరాజు, శ్రీశైలం, అశోక్‌గౌడ్, నిరంజన్ ఉన్నారు.



## సీబీఎస్‌ఈలో 'స్వామినారాయణ్' ప్రభంజనం



సాయిసుహాస్, సాయిచరణ్

జడ్చర్లటౌన్, మే 13 : సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో జడ్చర్లలోని శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులై ప్రతిభను చాటుకున్నారు. టీ వరేణ్య 97 శాతం, సాయిసుహాస్ 91 శాతం, సాయిచరణ్ 87 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలను సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాళ్లు అమరేందర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ భావిష్ అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేసిన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.



జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వేణుకాలనీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో జిల్లాకు చెందిన కొంతమంది ట్రాన్స్‌జెండర్స్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

*- గద్వాల అర్బన్, మే 13*

## రెండు గంటలపాటు బహిష్కరణ

- కరెంట్ పునరుద్ధరించాలంటూ అమరగిరి చెంచుగూడెంలో నిరసన
- సమస్య పరిష్కరించిన తరువాత ఓటేసిన గ్రామస్తులు



నిరసన వ్యక్తం చేస్తున్న చెంచులు

కొల్లాపూర్ రూరల్, మే 13 : మండలంలోని అమరగిరి చెంచుగూడెంలో ఏర్పాటు చేసిన 262 పోలింగ్ బూత్‌లో రెండు గంటలపాటు చెంచులు పోలింగ్‌ను బహిష్కరించారు. సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్.. 9 గంటలైనా ఒక్క ఓటు కూడా నమోదు కాలేదు. ఇక్కడే అసలు ట్విస్ట్ ఉన్నది. ఈవీఎంలు మొరాయించి పోలింగ్ ఆగిపోలేదు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా తాము ఇంకా చీకట్లోనే మగ్గుతున్నామని, తమను వెలుగులోకి తీసుకొచ్చేంత వరకు ఓటింగ్‌లో పాల్గొనమని చెంచులు నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల గాలిదుమారానికి చెట్టు విరిగిపడి కరెంట్ వైర్లపై పడడంతో తెగిపోయాయి. దీంతో నాలుగు రోజులుగా చెంచుగూడేనికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తమకు విద్యుత్ వెలుగులు అందించే వరకు ఓటేయబోమని చెంచులు భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న తాసీల్దార్ శ్రీకాంత్ విద్యుత్ అధికారులతో కలిసి చెంచుగూడెంకు చేరుకొని చెంచు సంఘం నాయకులు, మాజీ ఉపసర్పంచ్ మల్లేశ్‌తో చర్చలు జరిపారు. విద్యుత్ పునరుద్ధరణ చేసే వరకు ఓట్లు వేసేది లేదని తెలపడంతో విద్యుత్ అధికారులు హడావుడిగా చెంచుగూడెంకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. అనంతరం ప్రజలు కేంద్రానికి చేరుకొని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

***బావాజీపల్లిలో ఉద్రిక్తత***

తిమ్మాజిపేట, మే 13 : మండలంలోని బావాజీపల్లిలో పోలింగ్ సందర్భంగా కొంత ఉద్రిక్తత నెలకొన్నది. సాయంత్రం కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ప్రారంభమైన వాగ్వాదం పరస్పర దాడులకు దారితీసింది. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టడంతో ఉద్రిక్తత సమిసిపోయింది.


SHLOKA SCHOOL
Affiliated To CBSE Delhi, Affiliation No. 3630244
X CLASS 2023-2024 VALUE BASED EDUCATION
మెట్రో సిటి విద్యాసంస్థలకు ధీటుగా మా విద్యార్థినీ, విద్యార్థులను తీర్చిదిద్దిన SHLOKA CBSE SCHOOL.IIT (JEE) AND NEET కు అనుగుణంగా NCERT విద్యాప్రమాణాలను పాటిస్తూ 10th Results 2023-24 విద్యా సంవత్సరమునకు అత్యుత్తమ ఫలితాలు సాధించిన మా విద్యార్థులకు మరియు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు మా హృదయపూర్వక అభినందనలు.
94.5% JEEVAN
93.8% UMME AIMAN
100% Result
Admissions Open for Nursery to 10
Taluka Club Road, Jadcherla.
Website: www.shlokacbseschool.com | Email: bees.shloka@gmail.com
CONTACT: 7075523666/777/888